# ప్రజాశక్తి

శుక్రవారం 17 నవంబర్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల




శంకరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

కమ్యూనిస్ట్ ఉద్యమ వ్యాప్తిలో

## శంకరయ్య పాత్ర మరువలేనిది..

### సిపిఎం సీనియర్ నాయకులు వై.సిద్ధయ్య

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తిలో కామ్రేడ్ శంకరయ్య పాత్ర మరవలేనిదని సిపిఎం సీనియర్ నాయకులు వై.సిద్ధయ్య పేర్కొన్నారు. సిపిఎం తమిళనాడు రాష్ట్ర ఉద్యమ నిర్మాత, కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ ఎన్.శంకరయ్య సంతాప సభ గురువారం స్థానిక సుందరయభవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. బుధవారం మృతిచెందిన ఎన్.శంకరయ్య చిత్రపటానికి తొలుత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వై.సిద్దయ్య మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు ఉద్యమ వైపు వచ్చి తర్వాత తమిళనాడు రాష్ట్రంలో కార్మిక, కర్షక ఉద్యమాలను నిర్మించారని చెప్పారు. జిల్లా సిపిఎం సీనియర్ నాయకులు జాలా అంజయ్య మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న ఆయనను ప్రభుత్వాలు ఎనిమిది సంవత్సరాల పాటు జైళ్లలో నిర్బంధించాయన్నారు. మూడుసార్లు శాసన సభ్యునిగా ఎన్నికై ప్రజాసేవ చేశారని చెప్పారు. కమ్యూనిస్టు ఉద్యమ చీలిక సందర్భంలో సిపిఎం వైపు నిలబడి కేరళ, ▶ 2లో

## మిర్చి రైతు గుండెల్లో గుబులు

- తడిసి మోపెడవుతున్న పెట్టుబడి
- వర్షం కోసం ఎదురుచూపులు



ఎండిపోతున్న మిరప తోట

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

**మిరప పంట సాగు చేసిన రైతుల గుండెల్లో భయాందోళన నెలకొంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎండ తీవ్రతకు మిర్చి మొక్కలు వడపడి దెబ్బతింటున్నాయి. వ్యవసాయ బోర్లలోని నీరు అందకపోవడంతో పంటలను కాపాడుకునేదేలా అంటూ రైతులు దిగాలు చెందుతున్నారు. గడిచిన 20 రోజుల నుంచి తీవ్ర ఎండలకు మొక్కలు వడిలిపోతు న్నాయి. ముఖ్యంగా యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల్లో 18,750 ఎకరాల్లో ఈ ఏడాది మిర్చి పంటను సాగు చేశారు. అయితే దాదాపు అన్ని మండలాల్లోనూ సాగులో ఉన్న మిర్చి పంటలు బెట్టకొచ్చి దెబ్బతింటున్నాయి.**

మిరప కాయలు క్వింటా రూ.25 వేలు పలకడంతో రైతులు సీడు రకాలను ఎంచుకున్నారు. ఒక్కో మొక్కను రూ.1.50 నుంచి రూ.2 వరకు కొనుగోలు చేసి నాటారు. అయితే జూన్ నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో అవస్థలు పడుతున్నారు. ఎకరం కౌలు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంది. దీనికి తోడు నాగలి ఖర్చులు రూ.2200, గొర్రు ఖర్చులు రూ.2800, పాదులు, మొక్కలు నాటినందుకు రూ.32 వేలు, ఎరువులు, రసాయనిక మందులకు రూ.8 వేలు, పడి మొక్కలు నాటినందుకు కూలీ రూ.10 వేలు, కలుపు తీయడం, మందులు పిచికారి కూలీ రూ.10 వేలు ఇలా మొత్తం రూ.65 వేలు చొప్పున ఖర్చు పెట్టారు. ఇప్పటికే ▶ 2లో

### ఎకరాకు రూ.లక్ష నష్టపోయాం



**ముండ్లా దానియేలు, రైతు, గుర్రపుశాల**

వర్షాలు కురవడం లేదు. మూడు ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాను. ఎకరాకు రూ. 80 వేలు చొప్పున పెట్టుబడి పెట్టా. పంట ఏపుగా పెరిగే దశలో వ్యవసాయ బోర్లు మెరాయించడంతో తడులు పెట్టలేక పోయా. దీనికి తోడు ఎండ తీవ్రతకు పంట ఎండి పోతోంది. ఇదే పరిస్థితి మరో వారం రోజులు ఉంటే పంటపై ఆశలు వదులుకోవటమే.

నాపై వచ్చిన ఆరోపణలపై

## సమగ్ర దర్యాప్తు చేయాలని కోరా..

### ఎస్‌పిని కలిసిన మంత్రి మేరుగు నాగార్జున



మంత్రి మేరుగు నాగార్జున

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

జిల్లాలోని చుండూరు పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఏసీబీ దాడులకు సంబంధించి ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను ఏసీబీకి పట్టించిన గోవిందు అనే వ్యక్తి తనపై చేసిన ఆరోపణలన్నీ అసత్యాలేనని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఎస్‌పిని కోరానని మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. గురువారం జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్‌ని ఆయన కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బాపట్లలో హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న గోవిందు అనే వ్యక్తి టిడిపికి చెందిన వ్యక్తి అని, స్థలం వివాదం విషయంలో రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదు మేరకు చుండూరు పోలీసులు గోవిందుపై చర్యలు తీసుకున్నారని చెప్పారు. జరిగిన విషయాన్ని పక్కదారి పట్టిస్తూ.. తాను కూడా రూ.2 లక్షలు అడిగినట్లు, ఎస్ఐ తనతో మాట్లాడే సమయంలో గోవిందు కూడా అక్కడే ఉన్నట్లు తనపై చేసిన తప్పుడు ప్రచారంపై సమగ్ర విచారణ కోరుతూ ఎస్పీకి లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఎస్పీని కోరానన్నారు. అంబేద్కర్ ▶ 2లో

## ఒకే కుటుంబంలా కలిసి పనిచేద్దాం..

- టిడిపి-జనసేన కలయికను కోరుకుంటున్న ప్రజలు
- తెలుగుదేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్‌రావు
- ఉత్సాహంగా ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

రానున్న ఎన్నికలలో టిడిపి-జనసేన నేతలు కలసికట్టుగా ఒకే కుటుంబంలా పనిచేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. టిడిపి-జనసేన కలయికను ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఒంగోలు నగరంలోని ఆస్టాన్ ఫంక్షన్ హాలులో ఒంగోలు నియోజకవర్గ టీడిపి – జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ టిడిపి– జనసేన పార్టీల కలయికను ప్రజలే కోరుకుంటున్నారని, కలిసి పనిచేస్తే విజయం తధ్యమని తెలిపారు. పవన్‌కల్యాణ్ నిబద్ధత, చంద్రబాబు అనుభవం రెండు ప్రజలకు అవసరమని, ఆలోచనలలో భేదాలు ఉన్నా ఇరు పార్టీల నేతలు ఒకే కుటుంబంలా పనిచేయాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికలకు, ప్రస్తుతానికి సముద్రం అంత తేడా ఉందని, ఒక్కో నియోజకవర్గ ఓటర్ల జాబితాలో కొన్ని వేల దొంగ ఓట్లు ఉన్నాయన్నారు. ఇప్పటికే ఓటరు జాబితాను రెండు సార్లు పరిశీలించామని, టిడిపికి బూత్ స్థాయిలో పటిష్టమైన గహ సారథుల టీమ్ ఉందన్నారు. ఎన్నికల కోసం పనిచేస్తూనే అధికార పక్ష నాయకుల అవినీతిని ప్రజలకు తెలపాలని, రాక్షస ప్రభుత్వం నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలని కోరారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ మాట్లాడుతూ అరాచక పాలన కొనసాగిస్తున్న వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. పవన్ కల్యాణ్, చంద్రబాబు నాయుడు కలయికతో రానున్న ఎన్నికలలో విజయం తథ్యమన్నారు. టిడిపి-జనసేన పార్టీ నాయకులు 2024 ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, క్షేత్ర స్థాయి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా ముందుకు సాగాలన్నారు. వైసిపి ప్రభుత్వ అసమర్ధ, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. రానున్న కాలంలో ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికలతో ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. తద్వారా రానున్న ఎన్నికలలో ప్రజల మద్దతుతో విజయం సాధిస్తామనే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వైవి సుబ్బారావు, టీవీ శ్రీరామమూర్తి, కొఠారి నాగేశ్వరావు, బండారు మదన్, మహిళా నాయకులు షేక్ ఆరిఫా, గంగవరపు పద్మావతి, బోను దుర్గ, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి చిట్టెం ప్రసాద్, చనపతి రాంబాబు, కళ్యాణ్ ముత్యాల, జనసేన పార్టీ నగర అధ్యక్షులు రమేష్, పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మిర్చి రైతు గుండెల్లో గుబులు

(మొదటిపేజీ తరువాయి)

పెరిగిన వ్యవసాయ ఖర్చులకు తోడు ఎండలు తీవ్రంగా ఉండటం, మొక్కలకు నీరందించలేకపోవడంతో పంట చేతికందకపోతే మా పరిస్థితి ఏంటని కౌలు, చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

**ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే..**

**వెంకటేశ్వర్లు నాయక్, రైతు, పిల్లికుంట తాండా**

నేను అయిదు ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. ఇప్పటికే ఎకరాకు రూ.70 వేలు ఖర్చు చేశా. వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. అదనంగా రూ. రెండు లక్షలు ఖర్చు పెట్టి రెండు బోర్లు వేయించా. చుక్కనీరు పడలేదు. ఇప్పటికే తోట బెట్టకొచ్చింది. ప్రభుత్వం ఆదుకోకపోతే అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

## సమగ్ర దర్యాప్తు చేయాలని కోరా..

(మొదటిపేజీ తరువాయి)

భావజాలంతో ముందుకు వెళుతున్న తనపై తప్పుడు ఆరోపణలు సరికాదన్నారు. పేద వర్గాలకు చెందినవారు రాజకీయాల్లో ముందుకు వెళుతున్న నేపథ్యంలో కొందరు పనిగట్టుకొని ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఏసీబీ జరిపిన దాడుల్లో ఫిర్యాదిగా ఉన్న సదరు ఉద్యోగి కొందరి ప్రోద్భలంతో ఇలాంటి ఆరోపణలు చేసినట్లు మంత్రి చెప్పారు. జిల్లా పోలీస్ అధికారులు ఈ విషయమై సమగ్ర దర్యాప్తు జరిపి.. వాస్తవాలను నిగ్గు తేల్చాలన్నారు. సదరు ఉద్యోగి చేసిన ఆరోపణలు వాస్తవం కాకపోతే అతనిపై పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## శంకరయ్య పాత్ర మరువలేనిది..

(మొదటిపేజీ తరువాయి)

త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడేందుకు జరిగిన కృషిలో భాగస్వామి అయ్యారని కొనియాడారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ నేటి పాలకులు నయా ఉదారవాద విధానాలను అనుసరిస్తూ వివిధ తరగతుల ప్రజానీకాన్ని సమస్యల వలయంలోకి నెట్టివేస్తున్నారని, అలాగే మతతత్వ శక్తులు ప్రజల మధ్య చీలికలు తెస్తున్నాయన్నారు. ఈ ప్రమాదాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు నిర్మించడమే శంకరయ్య గారికిచ్చే నిజమైన నివాళి అని తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు, నగర కార్యదర్శి జి.రమేష్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, కె.రమాదేవి, పి.కల్పన, వి.బాలకోటయ్య జిల్లా నాయకులు కెఎఫ్.బాబు, సిహెచ్.వినోద్, యం.ఎల్.వి.ప్రసాద్, నగర నాయకులు తంబి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# విస్తరిస్తున్న 'క్షయ'

**- యర్రగొండపాలెం ప్రాంతంలో అధికారికంగా 161 కేసులు**

**- అనధికారికంగా 250పై మాటే**

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**


వ్యాధి క్షయ వ్యాధి మానవ మనుగడను ప్రశ్నార్థకం చేస్తోంది. ఈ వ్యాధితో ప్రజలు మరణిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. చాపకింద నీరులా ఈ వ్యాధి సమాజంలో పాకుతూనే ఉంది.

**యర్రగొండపాలెం ప్రాంతంలో..**

యర్రగొండపాలెం మండలంలో 40 మంది క్షయ రోగులు ఉన్నారు. త్రిపురాంతకంలో 26 మంది, పుల్లలచెరువులో 95 మంది కలిపి మొత్తం 161 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. అందులో 158 మంది క్షయ వ్యాధికి ఆరు నెలలు నుంచి తొమ్మిది నెలలు మందులు వినియోగిస్తున్నారు. యర్రగొండపాలెంలో ఒకరు, త్రిపురాంతకంలో ఇద్దరు కలిపి మొత్తం ముగ్గురికి మాత్రం ఒక్కొక్కరికి రూ. 20 లక్షలు విలువైన మందులు ప్రభుత్వం అందజేస్తుంది. (వ్యాధి తగ్గేంత వరకు) ముగ్గురికే రూ. 60 లక్షలు ఖర్చు చేయడం గమనార్హం. 15 ఏళ్ల క్రితం క్షయ వ్యాధికి గురైన వారిలో ప్రతి వంద మందిలో 26 మంది చనిపోయేవారు. ఆ సంఖ్య ప్రస్తుతం ఆరుకు తగ్గించగలిగినట్లు అధికారులు చెబుతున్నారు. క్షయ వ్యాధికి ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని జిల్లా క్షయ నివారణ కేంద్రంతో పాటు యర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి, పెద్దదోర్నాల, గిద్దలూరు, అద్దంకి, కందుకూరు, ఒంగోలు అర్బన్, ఒంగోలు రూరల్, కంభం, దర్శి, మార్టూరు, చీమకుర్తి, పర్చూరు, చీరాల, పొదిలి, ఉలవపాడులలో టీబీ యూనిట్లను ఏర్పాటు చేశారు. ఆర్‌టిపిసిఆర్ మిషన్ ద్వారా పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారిస్తారు. ప్రస్తుతం అన్ని మండల కేంద్రాల్లోనూ పరీక్షల నిర్వహణకు అవసరమైన యంత్ర సామగ్రిని ఏర్పాటు చేశారు.

**క్షయ వ్యాధి ఎలా వస్తోంది..**

క్షయ వ్యాధి మైక్రో బ్యాక్టీరియం ట్యూబర్ క్యూలోసిస్ అనే సూక్ష్మక్రిమి ద్వారా ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుంది. ఇది ప్రమాదకరమైన వ్యాధిగా వ్యాప్తి చెందుతోంది. ఇది ఊపిరితిత్తులకు సోకే వ్యాధి ప్రమాదకరమైనదని వైద్యులు సూచిస్తున్నారు. రెండు వారాలు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం లాంటి లక్షణాలు ఉంటే ఊపిరితిత్తుల క్షయవ్యాధిగా గుర్తించాలి. గాలి తుంపరలు ద్వారా వ్యాప్తి చెంది ఒకరి నుంచి ఒకరికి ఈ వ్యాధి సోకే అవకాశముంది. పొగాకు, ధూమపానం, మద్యపానం సేవించే వారికి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది.




పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యులు

**సక్రమంగా మందులు వాడితే నయమవుతుంది**

**కె సౌమ్య ప్రియదర్శిని, టిబి సూపర్‌వైజర్, యర్రగొండపాలెం**



క్షయవ్యాధిని తొందరగా గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడడం వల్ల పూర్తిగా నయం చేసుకోవచ్చు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేక పర్యవేక్షణలో ఈ మందులు అందిస్తున్నారు. వ్యాధిపై రోగులకు అప్రమత్తంగా ఉండి మందులు వాడాలి.

**ప్రభుత్వం అందిస్తున్న మందులు ఇలా..**

క్షయవ్యాధి గ్రస్తులకు ఆరు నెలల పాటు ప్రభుత్వ అస్పత్రుల్లో మందులు అందజేస్తారు. మొండి క్షయవ్యాధికి తొమ్మిది నెలల నుంచి రెండు సంవత్సరాల పాటు మందులు వాడాలి. వారికి తొమ్మిది నెలలకు గాను ఒక్కొక్కరికి రూ.4 లక్షల విలువైన మందులను ఆరోగ్యశాఖ ఉచితంగా అందిస్తోంది. రోగి బరువును బట్టి మందు మోతాదు నిర్ణయిస్తారు. మందులు వాడుతున్న రోగికి నిక్షయ పోషణ యోజన క్రింద నెలకు రూ. 500 చొప్పున పౌష్టికాహార పారితోషికంగా చెల్లిస్తున్నారు. దాతలు ముందుకొచ్చి క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

క్షయ వ్యాధి భవిష్యత్తులో రాకుండా ఉండేందుకు పుట్టిన వెంటనే పసి బిడ్డలకు బిసిజి సూది మందు వేస్తారు. క్షయ వ్యాధి వచ్చిన వారు దగ్గినప్పుడు నోటికి గుడ్డ అడ్డుపెట్టుకోవాలి. ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయకూడదు. వ్యాధి నిర్ధారణ అయ్యాక వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా మందులు వినియోగించాలి. వ్యాధి లక్షణాలు తగ్గినప్పటికీ వైద్యం, మందులు ఆపకూడదు.

# 1630 లీటర్ల డీజిల్ పట్టివేత

**శింగరాయకొండ :** శింగరాయకొండ మండలం ఊళ్లపాలెం గ్రామంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం రెండు దుకాణాలపై దాడులు నిర్వహించి రూ.1.60.718 విలువైన 1630 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎ.ఎస్‌పి బి .భవాని హర్ష ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరవ శ్రీనివాస రెడ్డి, శ్రీమన్నారాయణ దుకాణాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 1630 లీటర్ల డీజిల్‌ను గుర్తించి సీజ్ చేశారు. అనుమతి లేకుండా డీజిల్ వ్యాపారం చేస్తున్న నిందితులపై సంయుక్త కలెక్టర్ వారి కోర్టు లో 6ఎ కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన డీజిల్‌ను శింగరాయకొండలోని ఐఒసి పెట్రోల్ అవుట్‌లెట్స్‌లో అప్పగించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఫ్ఆఐఒ ఆదిత్య, సిఐ రాఘవరావు, ఎస్ఐ నాగేశ్వరరావు,ఎఒ సంగమేశ్వర రావు, తహశీల్దారు పాల్, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న డీజిల్ డబ్బాలు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దామచర్ల

## టిడిపి కార్యాలయం ప్రారంభం

**ప్రజాశక్తి-ఒంగోలు**

తెలుగుదేశం పార్టీ గాంధీనగర్ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

## విద్యార్థులకు అభినందనలు

**ప్రజాశక్తి-కొనకనమిట్ల**

ప్రపంచ కళాకారుల దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 25న నిర్వహించిన రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచినట్లు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం, ప్రిన్సిపల్ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు పతకాలను నిర్వాహకులు పోస్టు ద్వారా పంపినట్లు ఆయన తెలిపారు. ఈ పోటీల్లో ఎం మహేష్, బి అభిషేక్‌లు బంగారు పతకాలు, ఎం మహేష్, ఎం భరత్‌లు సిల్వర్ పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను ఆయన అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు కె ప్రసాదరావు, ఉపాధ్యాయులను, విద్యార్థులను ఆయన అభినందించారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

## వృద్ధులకు అన్నదానం

**ప్రజాశక్తి-దర్శి**

దర్శికి చెందిన పత్తి వెంకట కోటేశ్వరరావు, శ్రీలక్ష్మి కుమార్తె నానసాహితీ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక షిర్డీ సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు శ్రీనివాసరావు, పావని, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

## విఆర్‌కు ఎస్ఐ కోటయ్య

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

ఇప్పటిదాకా యర్రగొండపాలెం ఎస్ఐగా పని చేసిన జి కోటయ్యను గురువారం విఆర్‌కు బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఒంగోలు విఆర్‌లో పని చేస్తున్న ఎంవి రాజేష్‌ను ఎస్ఐగా బదిలీ చేశారు.

# ఒంగోలులో సైనిక్ స్కూలు ఏర్పాటు చేయండి

### - కేంద్ర రక్షణ శాఖ సెక్రటరీని కోరిన ఎంపి మాగుంట

**పజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

ఒంగోలులో సైనిక్ స్కూలు, మాజీ సైనికులకు ఈసిహెచ్ఎస్ ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ అరమనేను ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి కోరారు. గురువారం ఢిల్లీలోని కేంద్ర రక్షణ శాఖ సెక్రటరీ, శ్రీ గిరిధర్ అరమనేను ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపి మాగుంట మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో ముఖ్యంగా పశ్చిమ ప్రాంతమైన గిద్దలూరు పరిసర ప్రాంతాలకు చెందిన వారు రక్షణ శాఖలో సుమారు 20,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. విశ్రాంత సైనికులు 13,000 మంది వారి కుటుంబ సభ్యులు ఎక్కువ మంది జిల్లాలో నివసిస్తున్నారన్నారు. ప్రస్తుతం గిద్దలూరులోని చిన్న వైద్యశాల వారి వైద్య సదుపాయాలను తీర్చలేకపోతుందన్నారు. ఇతర జిల్లాలలో ఏర్పాటు చేసిన విధంగా ప్రభుత్వ జాబితాలో చేర్చబడిన అన్ని సదుపాయాలు ఉన్న వైద్యశాలలు ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఈసిహెచ్ఎస్ వైద్యశాలను, ఒక సైనిక స్కూలును కూడా ఏర్పాటు చేయవలసిందిగా ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి లిఖిత పూర్వకంగా కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి ఈసిహెచ్ఎస్ వైద్యశాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని, దీంతో పాటు సైనిక స్కూలు ఏర్పాటుకు కషి చేస్తానని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డికి హామీ ఇచ్చారు.



కేంద్ర రక్షణ శాఖ సెక్రటరీతో మాట్లాడుతున్న మాగుంట

# మహిళా భద్రతకు 'దిశా' యాప్ ఉపయోగం



దిశా యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి-వేటపాలెం**

దిశా యాప్ మహిళ భద్రతకు ఉపయోగపడుతుందని వేటపాలెం ఎస్.ఐ జి.సురేష్ తెలిపారు. గురువారం వేటపాలెం పట్టణ ప్రధాన రహదారి వద్ద ప్రజలకు దిశా యాప్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మహిళా పోలీసలతో కలసి మహిళలకు యువతకు దిశ యాప్ పై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ దిశ ఆవశ్యకత వివరించారు. స్మార్ట్ ఫోన్స్ లో ఈ యాప్ రిజిస్ట్రేషన్ చేసి ఆపద సమయంలో దిశాకు ఎస్ ఓ ఎస్ బటన్ ఉపయోగించి తక్షణమే పోలీస్ సహాయం ఎలా పొందాలో మహిళ రక్షణ కోసం దిశా యాప్ విశిష్టతపై అవగాహన కల్పించారు. ఒంటరిగా ఆటోల్లో, ఇతర వాహనాల్లో ప్రయాణించేవారు ట్రాక్ మై ట్రావెల్ అను ఆప్షన్ వినియోగించుకుంటే వారు వెళ్లే రూట్‌ని ట్రాక్ చేస్తామన్నారు. ఆ వాహనం సరైన మార్గంలో వెళ్లని పక్షంలో వెంటనే సంబంధిత ప్రాంతం పోలీసులను అప్రమత్తం చేస్తుందని తెలిపారు. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరితో ఈ దిశ యాప్ డౌన్లోడ్ చేయించుకొని ఆపద సమయంలో వినియోగించుకునేలా మహిళలకు ఉపయోగపడుతుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

# రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-పంగులూరు**

ఈనెల 18వ తేదీన జమ్ములపాలెం రోడ్‌లోని ఎమ్మెస్సార్ కళ్యాణ మండపంలో, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీల అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని టిడిపి రాష్ట్ర బీసీ సాధికారిక కమిటీ సభ్యుడు దాసరి హనుమంతరావు గౌడ్ తెలిపారు. గురువారం సాయంత్రం పంగులూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాపట్ల పార్లమెంట్ పరిధిలోని బాపట్ల, రేపల్లె ,వేమూరు, చీరాల, పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు, నియోజకవర్గాలకు సంబంధించిన తెలుగుదేశం, జనసేన బిజెపి, సిపిఐ, బీఎస్పీ, నవతరం పార్టీ, జై భీమ్ పార్టీ, సమాజ్‌వాది పార్టీ, ఆమ్‌ఆద్మీ పార్టీ, ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు, కులవృత్తులతో కలిసి ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని హనుమంతరావు గౌడ్ తెలిపారు. ఈ సమావేశానికి రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని చెప్పారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రతి ఒక్క బీసీ మేధావులు, బీసీ నాయకులు, కార్యకర్తలు విరివిగా హాజరై, బీసీల సమస్యలపై వస్తున్న ఇబ్బందులపై చర్చించి, బీసీల సమస్యలపై పోరాడాలని కోరారు. అద్దంకి నియోజకవర్గం నుంచి ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని హనుమంతరావు గౌడ్ కోరారు. కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.



దాసరి హనుమంతరావుగౌడ్

# వరి, మొక్కజొన్న బదులుగా ప్రత్యామ్నాయ పంటలు

**ప్రజాశక్తి-వేటపాలెం**

చీరాల సబ్-డివిజన్ పరిధిలోని చీరాల, వీటపాలెం మండలంలో రైతులు ఆర్.బి.కెలో ప్రత్యామ్నాయి సాగు గురించి జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త విజయనిర్మల అవగాహన కల్పించారు. సాగునీరు సంతృప్తికరంగా నానిన ఆరుతడి పంటలు అయిన మినుము, జొన్న, పంటలు సాగు కొరకు కావలసిన సమాచారాన్ని రైతులకు తెలియచేశారు. జిల్లా ఏరువాన్ కేంద్రం కో-ఆర్టిమీటరు ఓబయ్య ప్రస్తుతము సాగు చేసిన వరిలో వాడి వీక్షలు నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. వరి పరిశోధనా కేంద్రం, బాష్కో నుంచి సీనియర్ శాస్త్రవేత్త సాంబశివరావు వరిలో ప్రస్తుతం డొల్లికుడు కనపడుతుందని దీని నివారణకు రిజెంట్ గుళికలు జె03 10 84లు లేదా లీజైంట్ ఆగ్రా గుళితాలు బి అయితే 25030 5 8లలు వేసి నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమాన్ని చీరాల సహాయవ్యావసాయ సంబాల మెలు, ఇస్రాయం ఆధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు కాశీవిశ్వనాద్ పాల్గొన్నారు, చీరాల, వేటపాలెం మండల వ్యవసాయ రైతులు, సహాయకులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు



ఘటనా స్థలంలో ఉన్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవి

## ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

### క్షతగాత్రులను ఆంబులెన్స్ ఎక్కించిన గొట్టిపాటి

**ప్రజాశక్తి-అద్దంకి**

ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన కలవకూరు రోడ్డులో ఇటుకల బట్టీల వద్ద గురువారం చోటు చేసుకుంది. వివారాల్లోకి వెళితే అద్దంకి నుంచి కలవకూరు వెళ్ళే దారిలో ఇటుక బట్టీల వద్ద రెండు బైకులు ఢీ కొని ఇరువురు గాయపడ్డారు. అదే మార్గంలో ప్రయాణం చేస్తున్న శాసన సభ్యులు గొట్టిపాటి రవి కుమార్ కారు ఆపి క్షతగాత్రులను తన సిబ్బందితో ప్రధమ చికిత్స చేయించి, అంబులెన్స్‌కి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ వచ్చేదాకా ప్రమాద స్థలి వద్దనే వేచి ఉండి క్షత గాత్రులను తరలించేంతవరకు అక్కడే ఉన్నారు.

## కుక్క కాటుతో ఇద్దరికి గాయాలు

**ప్రజాశక్తి-కంభం రూరల్**

పట్టణంలోని కోనేటి వీధికి చెందిన షేక్ షబ్బర్, యూసుఫ్ అనే ఇద్దరు భవననిర్మాణ కార్మికులు పనికి వెళ్తు కుక్క కాటుకు గురైన సంఘటన గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పట్టణంలో ఇటీవల కాలంలో ఎంతోమంది కుక్కకాటుకు గురవుతున్నారు. కంభం కందులాపురం పరిధిలోని పలు వీధులలో కుక్కలు స్వైర విహారం చేస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నిధులు మంజూరు పత్రం అందజేస్తున్న మంత్రి సురేష్

## బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

పెద్దదోర్నాల మండలంలోని గంటావానిపల్లి గ్రామానికి కేజీరోడ్డు నుంచి తీగలేరు మీద హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ప్రభుత్వం రూ. 2.70 కోట్లు మంజూరు చేస్తూ జీవో నెంబర్ 763 జారీ చేసింది. ఈ జీవో కాపీని యర్రగొండపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గంటావానిపల్లి సర్పంచ్ యక్కంటి రమాదేవి, వెంకటేశ్వరరెడ్డిలకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అందజేశారు. త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొండేటి వెంకటేశ్వరరెడ్డి, నడిపి రాములు, లక్ష్మయ్య, బాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం

**ప్రజాశక్తి-మార్కాపురం**

స్థానిక శ్రీఅయ్యప్ప దేవాలయంలో ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా అయ్యప్ప దీక్షాపరులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి గురువారం ప్రారంభించారు. వచ్చే సంక్రాంతి పర్వదినం వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు వక్కలగడ్డ మల్లికార్జునరావు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.


దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వై సురేష్

## దిశ యాప్‌పై అవగాహన

**ప్రజాశక్తి - చెరుకుపల్లి**

ఆపదలో ఉన్నప్పుడు దిశ యాప్ మహిళలకు రక్షణగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ దిశ యాప్ గురించి అవగాహన కలిగి ఉండాలని, దిశ యాప్‌ను తమ ఫోన్లలో ఉంచుకోవాలని ఎస్ఐ వై సురేష్ అన్నారు. మండలంలోని మహిళలకు గురువారం అవగాహన కల్పించి యాప్‌ను ఫోన్లో డౌన్లోడ్ చేయించారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుందని అన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే దిశ యాప్‌ను ఉపయోగించడం ద్వారా భద్రత కలుగుతుందని మహిళలు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఐలాండ్ సెంటర్, ఆరుంబాక, ఖాదర్ ఖాన్ సెంటర్, కోటి సెంటర్లలో శిబిరాలు ఏర్పాటు చేశారు.


మజూరీలు పెంచాలని కోరుతున్న చేనేత సంఘం నాయకులు

## చేనేత కార్మికులకు మజూరీ పెంచాలి

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

చేనేత కార్మికులకు పెరిగాన నిత్యవసరాలకు అనుగుణంగా మజూరి పెంచాలని చేనేత కార్మిక సంఘం ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు గొట్టుముక్కల బాలాజీ, మురుగుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ఉమ్మడి రేపల్లె పాత తాలూకా పరిధిలోని సొసైటీలలో మజూరీలు పెంచినప్పటికీ ప్రస్తుతం పెరిగిన నిత్యవసర ధరలతో కార్మికుల జీవనోపాధి కరువైందని అన్నారు. మాస్టర్ వివర్లు, సహకార సంఘాలు వస్త్ర తయారిపై మజురిని పెంచి కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే చేనేత రంగం సంక్షోభంలో చిక్కుకొని కార్మికులకు ఉపాధి అందటం లేదని అన్నారు. అరకొరగా తయారు చేసే వస్త్రాలకు మజూరి తక్కువగా ఉండటంతో గిట్టుబాటు కాక అనేక మంది కార్మికులు పస్తులు ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మర్రివాడ వెంకటరావు, దీపాల సత్యనారాయణ, దొంతు కోటేశ్వరరావు, బట్టు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.


ఎంఎల్ఎ అనగాని సమక్షంలో టిడిపిలో చేరిన కార్యకర్తలు

## టిడిపిలోకి పలువురు చేరిక

**ప్రజాశక్తి - రేపల్లె**

టిడిపిలోకి రోజురోజుకీ వలసలు పెరుగుతున్నాయని ఎంఎల్ఎ అనగాని సత్య ప్రసాద్ అన్నారు. నగరం మండలానికి చెందిన వైసీపీ ముఖ్య నాయకులు గురువారం టీడీపీలోకి చేరారు. నగరం మండలంలోని పమిడిమర్రు, తోటపల్లి గ్రామాలకు చెందిన పలువురు రేపల్లె టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్ సమక్షం లో టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ వీరికి టిడిపి కండువా కప్పి ఆహ్వానించారు. రాబోయే రోజుల్లో టిడిపిలో చేరికలు భారీ స్థాయిలో ఉంటాయని అన్నారు. టిడిపి నాయకులు అంతా కలిసి మెలిసి కష్టపడాలని సూచించారు. పాత నేతలతో కలిసి ఐకమత్యంగా పనిచేసి టిడిపి విజయానికి కృషి చేయాలని కోరారు. ప్రజలందరూ ఆలోచించి సరైన నేతను ఎన్నుకోవాలని కోరారు. టిడిపిలో కష్టపడ్డ ప్రతి నాయకుడికి, కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జీవి నాగేశ్వరరావు, జీవి రామారావు, అంతాని మురళీధదరావు, గూడపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఎన్ బాబురావు

**ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్**

పంచాయతి కార్మీకులు గత 11రోజులుగా చేస్తున్న సమ్మెకు సిపిఎం చీరాల డివిజన్ కార్యదర్శి ఎన్ బాబూరావు మద్దతు ప్రకటించారు. 11రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు, నాయకులు పట్టించుకోక పోవటం బాధ్యతా రాహిత్యమని ఆరోపించారు. గత 3నెలలుగా కార్మీకులకు రావాల్సిన జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 3సంవ త్సరాల నుండి బట్టలు, సబ్బులు, అందజేయలేదని అన్నారు. కార్మీకులకు రావాల్సిన న్యాయమైన జీతాలు చెల్లించకుండా కారంచేడు మండలం నుండి కార్మీకులను తీసుకు వచ్చి పనిచేయించాలనే ఆలోచనను మానుకోవాల ని హెచ్చరించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నా రని అన్నారు. సమ్మె చేస్తున్న వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇలాగే కొనసాగితే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెలో సిఐటియు పర్చూరు డివిజన్ కార్యదర్శి జి ప్రతాప్‌కుమార్, కార్మీకులు నల్లపు రంగారావు, వెంకటేశ్వర్లు, సుబ్బారావు పాల్గొన్నారు.

పంచాయితీ కార్మికులు గత 10రోజులుగా సమ్మె చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిన పంచాయితీ పాలకవర్గం, అధికారులు పోటీ కార్మికులతో పనులు చేయించే ప్రయత్నం చేస్తూ కార్మికుల సమస్యలను జటిలం చేస్తున్నారు. కార్మికుల సమ్మెతో గ్రామంలో చెత్త, చెదారం ఎక్కడి కక్కడ పేరుకు పోయింది. ప్రధాన కాలువల్లో మురుగు నీరు రోడ్డుపైకి పారుతున్నది. గతంలో కూడా ఇలానే జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికులు సమ్మె బాట పట్టారు. కరోన సమయంలో అమూల్యమైన సేవలందించిన పంచాయతి కార్మీకులకు కనీసం 3 సంవత్సరాల నుండి కార్మికులకు ఇవ్వాల్సిన రక్షణ పరికరాలైన చెప్పులు, బట్టలు, సబ్బులు, నూనెలు ఇవ్వక పోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. సాక్షాత్తు కలెక్టర్‌కు చెప్పిన కూడా సమస్య పరిష్కారం కావడం లేదు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామంలో డెంగూ కేసులు ఉన్నాయి. జలుబు, దగ్గులు, సాధారణ జ్వరాలు ఉన్నాయి. ఇంత ప్రాధాన్యత ఉన్న ఇంకొల్లుకు పారిశుద్ధ్యం కొరవడింది. సమ్మెకు మద్దతు ఇచ్చిన సిఐటియు నాయకులు నాగండ్ల వెంకట్రావును బెదిరిస్తున్నారు. గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికైనా పంచాయతి కార్మీకులకు జీతాలు చెల్లించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


కార్మికుల సమ్మెతో పేరుకుపోయిన చెత్తకుప్పలు

# 18న మేధోమదన సదస్సు: జైభీమ్

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**


దోవా రమేష్‌రాంజీ

సిఎం జగన్మోహన్ రెడ్డి అధికారానికి తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించిన 27రకాల సంక్షేమ పథకాలు రద్దు చేసినందుకు నిరసనగా ఈనెల 18న విజయవాడలో సామాజిక సాధికార దగాయాత్రపై మేధో మదన సదస్సు జరుగుతుందని జై భీమ్ పార్టీ జిల్లా అధ్యక్షులు దొవా రమేష్ రాంజీ తెలిపారు. స్థానికంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓట్లతో అధికారానికి వచ్చి వారికున్న పదకాలు, జిఒలను రద్దు చేయటమే కాక వారిని దగా చేస్తూ హత్యాకాండ, సామాజిక, రాజకీయంగా దగా చేశాడని ఆరోపించారు. ఇప్పుడు సామాజిక సాధికార యాత్ర చేపట్టటాన్ని దగాయాత్రగా ఆరోపించారు. వైసీపీ చేపట్టిన సామాజిక సాధికార దగాయాత్రపై విద్యార్థి సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల మేధావులతో విజయవాడ ఐలాపురంలోని శ్రీరామ ఫంక్షన్ హాలులో నిజాలు నిర్ణయాలు అనే అంశంపై చర్చ గోష్టి జరుగుతుంది అన్నారు. కార్యక్రమానికి మాజీ న్యాయమూర్తి, హైకోర్టు న్యాయవాది జై భీమ్ పార్టీ వ్యవస్థాపకులు జడ శ్రవణ్ కుమార్ పాల్గొంటారని అన్నారు.

# నోరు అదుపులో పెట్టుకోవాలి

- ఇసుకదొంగలెవరో ప్రజలకు తెలుసు
- చీరాల ప్రజలు తరిమితే పర్చూరు వెళ్లారు
- టిడిపి, జనసేన అపవిత్ర పొత్తు : వైసిపి

**ప్రజాశక్తి - చీరాల**

దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఆమంచి స్వాములు మాట్లాడిన తీరు ఉందని మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొంఢ్రు బాబ్జి, గుంటూరు మాధవరావు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబు అన్నారు. స్థానిక ఆర్ అండ్‌బి అతిధి గృహంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణా చేసేదెవరో ప్రజలకు తెలుసని అన్నారు. ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి, వెంకటేష్‌లపై ఆరోపణలు చేసేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. టిడిపి, జనసేన సమావేశంలో కొండయ్య, ఆమంచి స్వాములు వ్యాఖ్యలను ఖండించారు. గడిచిన నాలుగేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని అన్నారు. ఇసుక దందాకు పాల్పడి హైదరాబాద్ రియల్ ఎస్టేట్లకు వేల లారీలు ఇసుక తరలించి కోట్లు దండుకున్న మీరు నేడు నీతులు చెబుతుంటే హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ప్రభుత్వ నిధులలో అవినీతి జరిగిందన్న ఆరోపణలకు ఆధారాలు చూపాలని అన్నారు. 2014, 2019 ఎన్నికలలో నియోజకవర్గ పరిస్థితులు గమనించిన ప్రజలు తరిమి కొడితే పర్చూరు వెళ్లారని అన్నారు. అక్కడ నుండి గిద్దలూరు వెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. నిన్నటి వరకు వైసిపిలో ఉన్న అన్నదమ్ములు అధికారాన్ని అడ్డం పెట్టుకొని దండిగా సంపాదించారని అన్నారు. అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. రానున్న 2024 ఎన్నికలలో 20వేల మెజారిటీతో వెంకటేష్‌ను గెలిపించుకొని సీఎం జగనన్నకు కానుకగా ఇస్తామని అన్నారు. చీరాలలో టిడిపి, జనసేన అపవిత్ర పొత్తని అన్నారు. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, వేటపాలెం మండలం వైసిపి అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, రామన్నపేట సర్పంచ్ కందేటి రమణ, వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సల్లూరి అనిల్, ఆర్బికె చైర్మన్ కావూరి రమణరెడ్డి, మునిసిపల్ కౌన్సిలర్స్ బత్తుల అనిల్, మల్లెల లలిత రాజశేఖర్, పొత్తూరి సుబయ్య, కలవకూరి యానాదిరావు, షేక్ సుభానీ, యాతం మేరిబాబు, కోలా శివ, కోడూరి ప్రసాదరెడ్డి, శిఖాకొల్లి వెంకటేశ్వర్లు, మామిడాల రాములు, చిలుకోటీ శ్రీను, తలకాయల సుధీర్, వాసిమల్ల వాసు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు


సమావేశంలో బిఎస్‌పి నాయకులు రాజశేఖరరావు

## బిఎస్‌పి బలోపేతానికి కృషి

**ప్రజాశక్తి - బాపట్ల**

క్షేత్రస్థాయిలో బహుజన సమాజ పార్టీని బలోపేతం చేసేందుకు బీఎస్పీ శ్రేణులతో కలిసి కృషి చేస్తానని బిఎస్‌పి బాపట్ల, ప్రకాశం జిల్లాల పర్యవేక్షకులు జంగం రాజశేఖరరావు అన్నారు. స్థానికంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిఎస్‌పి సిద్ధాంతాలను బడుగు, నిరుపేద, మైనారిటీ వర్గాల ప్రజల్లోకి తీసుకెళ్ళి సామాజిక చైతన్యం కల్పించేందుకు రెండు జిల్లాల్లో పర్యటిస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు బిఎస్పీ సిద్ధాంతాలను వివరిస్తామని అన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా బిఎస్పి అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, బాపట్ల అధ్యక్షుడు కె వినయ్ రాజు, పట్టణ అధ్యక్షుడు నాగరా జు, జిల్లా పరిశీలకులు భగత్ సింగ్ పాల్గొన్నారు.


ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

## ఓటు హక్కు అందరి బాధ్యత

**ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్**

ఓటు హక్కు అందరి బాధ్యతని పర్చూరు ఎన్నికల అధికారి ఎం సత్యనారాయణ పేర్కొన్నారు. దగ్గుబాటి విద్యాసంస్థల ఆవరణలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఫార్మసీ కళాశాలలోని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని అన్నారు. సభకు తహశీల్దారు పి బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ వేణు పాల్గొన్నారు.


వైసిపి జెండా ఆవిష్కరిస్తున్న వైసిపి నేత రామారావు

## వైసిపి జెండా ఆవిష్కరణ

**ప్రజాశక్తి - సంతమాగులూరు**

పేదరిక నిర్మూలన సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే సాధ్యమని వైసీపీ మండల కన్వీనర్ చింతా రామారావు అన్నారు. మండలంలోని ఏల్చూరు-2 సచివాలయ పరిదిలో ఏపీకి జగనన్నే ఎందుకు అవసరం అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా ప్రదర్శన, వైసీపీ జెండా ఆవిష్కరణ చేశారు. అన్ని వర్గాల సంక్షేమం కాంక్షించిన జగన్ తిరిగి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మందా సూరిబాబు, నాయకులు అప్పిరెడ్డి, ముసలారెడ్డి, డి గాలెయ్య, గుర్రం ఏడుకొండలు పాల్గొన్నారు.


ఆడుదాం ఆంధ్రాపై అవగాహన కల్పిస్తున్న అధికారి

## 'ఆడుదాం ఆంధ్ర'

**ప్రజాశక్తి - అద్దంకి**

స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన సదస్సు మేనేజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. 2023 డిసెంబర్ లో సచివాలయాల వారీగా ఆటల పోటీలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. అడ్మిన్ కార్యదర్శులు, వార్డు వాలంటీర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ ఎస్తేరమ్మ, వైస్ చైర్ పర్సన్ పదమేష్, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

# మింగుడు పడని 'మినపగుళ్లు'

- కిలోకు రూ. 40 పెరుగుదల
- కొనుగోలు చేసేందుకు పేదల ఇక్కట్లు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

ప్రతి ఇంట్లో అల్పాహారంగా ఇడ్లీ, గారె, దోసె తింటారు. వాటి తయారీకి మినపగుళ్లు తప్పనిసరి. మినపగుళ్ల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. సామాన్యుల వంటింటి బడ్జెట్ తలకిందులవుతోంది. కందిపప్పు ధర ఆకాశాన్నంటుతోంది. ఫలితంగా చాలా మంది పప్పుల వినియోగాన్ని తగించారు. రెండు నెలల వ్యవధిలోనే మినపగుళ్ల ధర కిలోకి రూ.40 నుంచి రూ.50 పెరిగింది. 20 రోజుల కిందట కిలో మినపపప్పు రూ.115-125 పలికింది. ఇప్పుడు రూ.135-150 మధ్య ఉంది. బ్రాండ్ల పేరుతో మినపగుళ్ల కిలో రూ.200 వరకూ అమ్ముతున్నారు. దేశ వ్యాప్తంగా వర్షాభావ పరిసితుల్లో మినుము సాగు విస్తీర్ణం, దిగుబడి తగ్గింది. ప్రజల అవసరాలకు తగినట్లుగా మినపగుళ్ల దిగుమతులు లేవు. దీంతో ధరలు నిత్యం పెరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. కందిపప్పు ధర కిలో ధర రూ. 175కి చేరింది.

**ఇదీ పరిస్థితి..**

ఇక్కడి వ్యాపారులు మన రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక, రాజస్తాన్, తెలంగాణా నుంచి మినపగుళ్లు దిగుమతి చేసుకుంటారు. ప్రతి ఏటా సెప్టెంబరు నెలాఖరు నుంచి అక్టోబరు చివర వరకు కొనుగోళ్లు, అమ్మకాలు చేస్తుంటారు. చాలా మంది ఏడాదికి సరి పడా సరుకు కొనుక్కొని ఇంట్లో నిల్వ చేసుకుంటుంటారు. ఈ సారి వర్షాభావ పరిస్థితుల్లో పంట విస్తీర్ణం తగ్గింది. పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు పడడంతో పంట దెబ్బతింది. ఫలితంగా దిగుబడులు తగ్గిపోయాయి. ఈ కారణంగా ధరలు పెరుగుతున్నాయి. కందిపప్పు విషయంలోనూ ఇదే జరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.



**దిగుమతి తగ్గి..డిమాండ్ పెరిగి**

మార్కెట్‌లో మినప గుళ్లు, కందిపప్పు లభ్యత తగ్గిపోవడంతో వాటి ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం క్వింటా మినుములకు రైతులకు రూ. పది వేల చెల్లిస్తున్నారు. రైతులు నుంచి సేకరించి శుద్ధి చేయడానికి మిల్లుకు తీసుకెళ్లే సరికి క్వింటా రూ. 10,600 అవుతోంది. క్వింటా మినుములు శుద్ధి చేస్తే 78 నుంచి 80 కిలోల మినపగుళ్లు వస్తాయి. ఆ ప్రకారంగా మార్కెట్లో కిలో మినపగుళ్లు రూ.135 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

**మినపగుళ్ల వినియోగం తప్పని సరి...**

మారుతున్న ఆహారపు అలవాట్లలో భాగంగా ఉదయం, సాయంత్రం చాలా మంది ఇడ్లీలు తింటున్నారు. రాత్రివేళ ఎక్కువగా ఇడ్లీ లేదా దోసె తింటున్నారు. వీటి తయారీకి మినపగుళ్లు తప్పని సరి. మినపగుళ్ల ధరలు పెరిగినా ఆహారపు అలవాట్ల దృశ్యా కొనుగోలు చేయక తప్పని పరిస్థితి. ఈ విషయమై యర్రగొండపాలెంనకు చెందిన వ్యాపారి నారాయణ మాట్లాడుతూ తాను 25 ఏళ్ల నుంచి కిరాణా దుకాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మినపగుళ్ల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఏడేళ్ల కింద కిలో రూ. 170 పలికినట్లు తెలిపారు. ఆ తర్వాత అదే స్థాయిలో ధరలు చూడడం ఇదేనని తెలిపారు.

### ధరలు చూస్తే భయమేస్తోంది

**దూదేకుల గాలిబ్బి, గృహిణి, యర్రగొండపాలెం**



మినపగుళ్ల ధరలు చూస్తే భయమేస్తోంది. టిఫిను, పిండి వంటలు చేయాలన్నా మినపగుళ్ల ఎంతో అవసరం. పెరిగిన ధరలతో ఇబ్బంది పడుతున్నాం. ఈ ధరలతో టిఫినులు, పిండి వంటలు చేసుకోవడం చాలా కష్టం.

### టిఫెన్ వండటం మానుకున్నాం

**గురవమ్మ, గృహిణి, వేగినాటి కోటయ్య నగర్**



గతంలో రెండ పూటలా టిఫిన్ చేసేవాళ్లం. మినపగుళ్ల ధరలు పెరగడంతో టిఫిన్ తినడం మానుకున్నాం. మూడు పూటలా భోజనమే వండుకుంటున్నాం. ఇంతటి ధరలు ఈ ఐదేళ్లలో తామెప్పుడూ చూడలేదు. పెరుగుతున్న ధరలతో ఇబ్బందికరంగా మారుతుంది.

### టిఫిన్ ధరలు పెరిగాయి

**కేశనపల్లి సుబ్బమ్మ, గృహిణి, యర్రగొండపాలెం**



గతంలో ఉన్న టిఫిన్ ధరలకు, ఇప్పటి ధరలకు చాలా వ్యత్యాసం ఉంది. హోటళ్లలో సైతం రూ. 50 పెడితే వచ్చే టిఫిన్ నేడు రూ. 80 అవుతుంది. ఇదే ధరలు కొనసాగితే సామాన్యుల మనుగడ కష్టమే. మినపగుళ్ల ధరలు తగ్గించాలి.

# కందుకూరు నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

**ఆర్‌టి జోనల్ చైర్మన్ బత్తుల సుప్రజా రెడ్డి**

**ప్రజాశక్తి-శింగరాయకొండ**




కార్తీకపౌర్ణమి సందర్భంగా ఈనెల 25న సాయంత్రం 8 గంటలకు కందుకూరు ఆర్‌టిసి డిపో నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఎపిఎస్‌ఆర్‌టిసి నెల్లూరు జోనల్ చైర్మన్ బత్తుల సుప్రజారెడ్డి తెలిపారు. ఈ బస్సులు ఈనెల 26న అరుణాచలం చేరుతాయని తెలిపారు. అరుణాచలేశ్వరుని దర్శనం మరియు కతికా నక్షత్రం సందర్భంగా సాయంత్రం మహా ద్వీప దర్శనం అనంతరం పౌర్ణమి తిథి సందర్భంగా సాయంత్రం అరుణాచల గిరి ప్రదర్శన చేయవచ్చునని తెలిపారు. ఈనెల 27న కార్తీక పౌర్ణమి ఉదయం తిథి మరియు కార్తీక సోమవారం సందర్భంగా మహాబలిపురం ముక్తేశ్వరం సూళ్లూరుపేట చెంగాలమ్మ గుడి తదితర పుణ్యక్షేత్రాలు దర్శించుకోవచ్చునని తెలిపారు. అదే విధంగా సముద్ర స్నానం చేయవచ్చునని తెలిపారు. యాత్ర సందర్భంగా 2 రోజులకు కలిపి టిక్కెట్, భోజనం కలిపి ఒక్కొక్కరు రూ.2,700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రవాణా సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వివరాలకు కందుకూరు డిపో మేనేజర్ 9959225698, మార్కెటింగ్ కోఆర్డినేటర్ 7382889870 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

# నగరపంచాయతీ చైర్మన్‌గా రాజ్యలక్ష్మి

**ప్రజాశక్తి-చీమకుర్తి**

చీమకుర్తి నగరపంచాయతీ నూతన చైర్మన్‌గా గోపురపు రాజ్యలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌ను ఎన్నుకున్నారు. గతంలో మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న చల్లా అంకులు ఇటీవల తమ పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి వైస్‌చైర్మన్ బాపతు వెంకటరెడ్డి ఇన్‌ఛార్జి చైర్మన్‌గా కొనసాగుతున్నారు.రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు చైర్మన్ పదవి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల అధికారిగా జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారిగా జాలిరెడ్డిని నియమించారు. రెండు రోజుల క్రితం ఆరవ వార్డు కౌన్సిలర్ గోపురపు రాజ్యలక్ష్మిని చైర్మన్‌గా నిర్ణయించారు. అందులో భాగంగా కౌన్సిల్ సమావేశంలో గోపురపు రాజ్యలక్ష్మిని చైర్మన్‌గా 16వ వార్డు కౌన్సిలర్ మేకల సులోచన,17 వవార్డు కౌన్సిలర్ ఆముదాలపల్లి ప్రమీల బలపరిచారు. మిగతా కౌన్సిలర్లు రాజ్యలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అభినందన సభ ఏర్పాటు చేశారు. సభలో ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొని నూతన చైర్మన్ గోపురపు రాజ్యలక్ష్మిని అభినందించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చీమకుర్తి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడపాలని సూచించారు. చైర్మన్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి సహకారంతో ముందుకు సాగుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చల్లా అంకులు,వైస్ చైర్మన్లు బాపతు వెంకటరెడ్డి, మాణిక్యం, జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు చలువాది బదరీ నారాయణ, వైసిపి పట్టణ అధ్యక్షుడు కె.శేఖరరెడ్డి, కౌన్సిలర్లు తప్పెట బాబూరావు, భీమన వెంకటరావు, ఎస్‌కె. యస్‌దాని, ఎస్‌కె.బాషా, గోపురపు చంద్ర, సుందరరామిరెడ్డి, జి. గంగయ్య, ఎ.ప్రమీల, మంచా హరికృష్ణ, మస్తాన్‌రెడ్డి, జి.ఓబులరెడ్డి, పత్తి కోటేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ ఎస్‌కె.ఫజులుల్లా తదితరులు పాల్గొన్నారు.



రాజ్యలక్ష్మిని అభినందిస్తున్న ఎమ్మెల్యే టిజెఆర్., మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి



శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

## సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ

**ప్రజాశక్తి-కొండపి**

ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతులందరికీ ధ్రువీకరణ పత్రాలు అందచేయాల్సిన బాధ్యత రైతు భరోసా కేంద్ర సిబ్బందిపై ఉందని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.కొండపి-1 రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ చేశారు. అదే విధంగా ఖరీఫ్-2023లో ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎఒ డి.విజయకుమార్, కొండపి -1 విఎఎ వెంకట నారాయణ, విఎఎబి చైర్మన్ ఆరికట్ల హరినారాయణ, గొట్టిపాటి మురళి,రైతులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

## మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

**ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్**

ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలోని మినిపార్కులో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం ఏర్పాటుకు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలో విశ్వేశ్వరయ్య విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు ఈదర వెంకట సురేష్‌బాబు, యనమల నాగరాజు, చింతపల్లి గోపి, ప్రముఖ ఇంజినీర్ ఎన్‌ఎస్.రాజు, ఎఎంసి చైర్మన్ కొటారి రామచంద్రరరావు తదితరులు పాల్గొన్నారు.




అన్నదానంలో పాల్గొన్న ప్రజలు

## ఆలయంలో అన్నదానం

**ప్రజాశక్తి-కొండపి**

కొండపి - కట్టావారిపాలెం గ్రామ మధ్య ఉన్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో నూతన విగ్రహ ప్రతిష్ట గురువారం నిర్వహించారు. ఆంజనేయస్వామి, శివుడు, వెంకటేశ్వరస్వామి, నవగ్రహాలను దాతల సహాయ సహకారాలతో ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ధ్యేయం : ఎంపిపి



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపిపి



చీమకుర్తిలో :కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపిపి శ్రీనివాసరావు

**ప్రజాశక్తి -మద్దిపాడు**

పేదల సంక్షేమే ధ్యేయమంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు ఎంపిపి వాకా అరుణా కోటిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గుండ్లాపల్లి గ్రామంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణా కోటిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలులో దేశంలోనే మన రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ప్రజలు ఎన్నడూ చూడని అభివద్ధి వైసిపి పాలనలో చూస్తున్నామన్నారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు అప్పారావు, సర్పంచి కొప్పోలు ఆంజనేయులు, ఎంపిటిసి పద్మకుమారి, ఘడియపుడి సర్పంచి రామాంజనేయులు, సీనియర్ నాయకులు తేళ్ళ పుల్లారావు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **చీమకుర్తి :** మండల పరిధిలోని మంచికలపాడు గ్రామంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, వైఎస్ ఎంపిపి జె. శ్రీనివాసరావు, జెసిఎస్ మండల కన్వీనర్ చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి మాట్లాడారు. మంచికలపాడు గ్రామంలో రూ.18 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు మళ్లీ జగన్మోహనరెడ్డికి అండగా నిలవాలన్నారు. అనంతరం అభివృద్ధి పనులకు సబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి సొసైటీ అధ్యక్షుడు జి. ఓబులరెడ్డి, వైసిపి మండల నాయకుడు జి.ఓబులరెడ్డి, సర్పంచి పి. నాగేశ్వరరావు, ఎంపిటిసి అంకయ్య, సుబ్బారావు, వెంకటేశ్వరరెడ్డి, సుగుణరావు, రమేష్ పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

## డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదలకు చర్యలు : కమిషనర్

**ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్**

నగరంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. 37వ డివిజన్ మంగమూరు రోడ్డు, జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్డు దగ్గర మ్యాన్ హోల్ నుంచి కాలువలో బ్లాక్ అయిన సిల్ట్‌ను గల్ఫర్ మిషనర్ ద్వారా శుద్దిచేసే పనిని గురువారం చేపట్టారు. ఈ పనులను కమిషనర్ పరిశీలించారు. కాలువల్లో వ్యర్థాలన్నీ బయటకు తీసి మురుగు నీరు సాఫీగా పోయేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు కమిషనర్ సూచించారు.

**సచివాలయంలో తనిఖీ**

నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు 37వ డివిజన్ గాంధీనగర్ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టీ, మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విధులకు హాజరు కాని సిబ్బందికి ఆఫ్‌సెంట్ వేశారు. మూమెంట్ రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది ఏకరూప దుస్తుల్లో హాజరు కావాలన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు అందజేసే అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా వారి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు.

## ఇండోర్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్**

స్థానిక 11వ డివిజన్ క్లోపేటలోని డిఎస్‌పి కార్యాలయం ప్రాంగణంలో 23/11 కెవి ఇండోర్ విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణానికి మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఈ సబ్ స్టేషన్‌ను ఎప్పుడో నిర్మించాల్సి ఉందన్నారు. స్థలం అందుబాటులో లేని కారణంగా జాప్యం జరిగిందన్నారు. పోలీసు శాఖతో మాట్లాడి వారిని ఒప్పంచి స్థలాన్ని సేకరించినట్లు తెలిపారు. చుట్టుపక్కల వారికి ఎలాంటి ఇబ్బంది జరగకుండా సబ్‌స్టేషన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పనులు త్వరగా పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో రాజీవ్‌నగర్, అంజయ్యరోడ్డు ప్రాంతాలలో అరవైమూడు కోట్ల రూపాయాలు వెచ్చించి అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్లోపేటలో పోలీసులు గేటు మూసి వేసినందు వల్ల స్థానికులు రాకపోకలకు ఇబ్బంది వస్తుందన్నారు. చుట్టూ తిరిగి రావడం జరుగుతోందనే సమస్య తన దృష్టిలో ఉందని, ఈసమస్య గురించి ఎస్‌పితో మాట్లాడి త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 11వ డివిజన్ కార్పొరేటర్ గంగవరపు ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, వైసిపి నాయకులు, విద్యుత్తుశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

## అడిగేదెవరు,,?

### సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యం

**ప్రజాశక్తి -మద్దిపాడు**

సచివాలయ సిబ్బంది ఇస్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అంతా మాఇష్టం.. మమ్మల్ని అడిగేదెవరు అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన ప్రజలు ఉదయం 11 గంటల వరకూ తాళాలు తీయక పోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. మండల పరిధిలోని సీతారాంపురం సచివాలయం సిబ్బంది పనితీరుపై విమర్శలు వెల్లవలెత్తుతున్నాయి. మా ఇష్టం వచ్చిన సమయానికి వస్తాం... మమ్మల్ని అడిగేది ఎవరు అన్నట్లు సిబ్బంది తీరు ఉందని గ్రామస్తులు బహిరంగంగా చర్చించు కుంటున్నారు. ఉన్నతాధి కారులు స్పందించి సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-నాగులుప్పలపాడు**

గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పుగుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చలపతిరావు తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహనీయుల జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందన్నారు, తద్వారా విజ్ఞానవంతులుగా ఎదుగుతారన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు ప్రసాద్,సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు బాలుమహేంద్ర, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. **సంతనూతలపాడు :** 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు భాగంగా స్థానిక ఎస్ఎస్‌కెసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మాతభాష ఔన్నత్యం అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డివిఎస్. రామాచార్యులు, చిన్నమ్మ, ఎన్,రంగనాయకులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. **టంగుటూరు :** గ్రంథాలయ పితామహులు ఎప్పటికీ చిరస్మరణీయులని టంగుటూరు ఎఎస్‌ఐ ఎన్.శ్రీధర్‌రావు, శ్రీచైతన్య హైస్కూల్ అకాడమిక్ డైరెక్టర్ వివి.రాజసింహా, హైస్కూల్ పీడీఎన్.అరుణ అన్నారు. టంగుటూరు శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయ పితామహులు డాక్టర్ ఎస్ఆర్.రఘునందన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటయ్యను స్మరించి వారి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పొందవచ్చునని చెప్పారు. అనంతరం చిత్రలేఖనం, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు గుమ్మడి వర్ధనరాజు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిడులు పాల్గొన్నారు. **కొండపి :** విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించకోవాలని డిప్యూటీ తహశీల్దారు సుజాత తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిటీ మాట్లాడుతూ డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య సేవలను కొనియాడారు. వారి జీవిత విశేషాల గురించి విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు, యుడిసి సుధాకర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



నాగులుప్పలపాడులో మాట్లాడుతున్న చలపతిరావు



కొండపిలో గ్రంథాలయ పితామహులకు నివాళి



టంగుటూరులో మాట్లాడుతున్న పీడీ అరుణ

# వైసీపీని కూకటివేళ్లతో సహా పెకిలిద్దాం



టిడిపి, జనసేన ఉమ్మడి సమావేశంలో ఎంఎల్ఏ గొట్టిపాటి

**ప్రజాశక్తి - అద్దంకి**

టిడిపి, జనసేన మొదటి ఆత్మీయ సమావేశం గురువారం పోతురాజుగండిలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. ఎంఎల్ఏ గొట్టిపాటి రవికుమార్, జనసేన కన్వీనర్ ఈదర హరిబాబుతోపాటు రెండు పార్టీల మండల కన్వీనర్లు హాజరయ్యారు. మన్నం త్రిమూర్తులు సభ ఆహ్వానం పలికారు. సమావేశానికి హరిబాబు అధ్యక్షత వహించారు. ఎంఎల్ఏ రవికుమార్ మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టుపై మొదటిగా స్పందించి మద్దతు తెలిపిన జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు అభినందనలు తెలిపారు. వైసిపి హామీలపై మడమ తిప్పి అమలు చేయకపోగా చెప్పినవన్నీ చేసినట్లు అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈదర హరిబాబు మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలిచే టిడిపి, జనసేన మైత్రి తప్పక అధికారం చేజిక్కించుకుంటుందని

## టిడిపి, జనసేన సమావేశంలో నేతల పిలుపు

అన్నారు. రాష్ట్రంలో గాడిదప్పిన పాలనను గాడిలో పెడతామని అన్నారు. సచివాలయ ఉద్యోగులు వైసిపి కార్యకర్తలుగా పనిచేస్తే తగినమోల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, కుందారపు రామారావు, జనసేన మండల కన్వీనర్లు సందిపోగు వినోద్ కుమార్, చల్లా వెంకట కృష్ణారావు, ఐటి కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, సాదు వెంకటేష్, కొట్టే నరసింహారావు, కసుకుర్తి వీర హనుమాన్, ఎం రామకోటేశ్వరరావు, గాదె రామాంజనేయులు, బత్తుల చంద్రశేఖర్, ఇమడా బత్తిన వెంకటేశ్వరరావు, చెవుల వెంకట్రావు, మేడ రేణు కోటేశ్వరరావు, అద్దంకి టిడిపి మండల కన్వీనర్లు కటారి నాగేశ్వరరావు, జాగర్లమూడి జయకృష్ణ, కొండేటి ఇజ్రాయిల్, చేవూరు వాసిరెడ్డి, మల్లెనేడి గోవిందరావు పాల్గొన్నారు.

**పర్చూరు :** అరాచక వైసిపి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు జనసేన, టిడిపి శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగుతామని టిడిపి బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు, ఎంఎల్ఏ ఏలూరి సాంబశివరావు అన్నారు. స్థానిక రోటరీ భవన్లో గురువారం ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ వైసీపీ నాలుగున్నర ఏళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఎవ్వరూ సంతోషంగా లేరని అన్నారు. ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. జగన్ పాలన వ్యవస్థలన్నీ ధ్వంసం చేశాడని అన్నారు. అభివృద్ధి జరగకపోగా విధ్వంసం, దౌర్జన్యం, అరాచకం రాజ్యమేలుతుందని అన్నారు. టిడిపి ప్రభుత్వ కాలంలో పర్చూరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు రూ.275కోట్లతో గుంటూరు ఛానల్ పొడగింపుకు నిధులు మంజూరు చేశామని గుర్తు చేశారు. కానీ ఈ అరాచక ప్రభుత్వం విధ్వంసంలో భాగంగా టెండర్లను నిలిపివేసి పనులను రద్దు చేసిందని అన్నారు. జనసేన ఇన్‌ఛార్జి పెద్దపూడి విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక వైసీపీ ప్రభుత్వంపై ఉమ్మడి పోరు సాగిద్దామని అన్నారు. వర్షాలు లేక ఎండుతున్న పంటలకు రూ.100కోట్ల నష్టపరిహార నిధులు కేటాయించి రైతులను ఆదుకోవాలని ఉమ్మడి సమావేశం తీర్మానించిందని తెలిపారు.



టిడిపి, జనసేన ఉమ్మడి సమావేశంలో ఎంఎల్ఏ ఏలూరి

# చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

## ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



ఇంటింటికీ కార్యక్రమంలో గొట్టిపాటికి హారతులతో స్వాగతం

**ప్రజాశక్తి - పంగులూరు**

చిద్రమైపోతున్న ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును సరైన మార్గంలో పెట్టి, దిశా నిర్దేశం చేయగల నాయకుడు చంద్రబాబు ఒక్కరేనని ఎంఎల్ఏ గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సైకో పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని అన్నారు. రాష్ట్రాన్ని, రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెంలో బాబు షఉరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలను కలిసి టిడిపి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించారు. రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాక అమలు చేసే మినీ మేనిఫెస్టో వివరించారు. వై ఏపీ నీడ్స్ జగన్ పేరుతో రూ.40కోట్ల ఖర్చుపెట్టి జగన్ రెడ్డి రంగుల రంగుల పాంప్లెట్లకు ప్రజల సొమ్మును ఖర్చు పెడుతున్నాడని విమర్శించారు. మాస్కులు అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను వేధించి చంపాడని అన్నారు. అనేక ఘటనల్లో దళితులపై దాడులు చేసినందుకు మళ్లీ జగన్‌ను గెలిపించాలా అని ప్రశ్నించారు. దళితుల సంక్షేమానికి అండగా ఉన్న 27దళిత సంక్షేమ పథకాలు రద్దు చేసినందుకు గెలిపంచాలా అని అన్నారు. తొలుత గ్రామంలో టిడిపి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కర్రీ వెంకట సుబ్బారావు, కుక్క పల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, గుర్రం ఆదిశేకర్, రమేష్ బాబు, మాజీ సర్పంచులు అమర్తపూడి ఏసోబు, ఉన్నం రవి, వలపర్ల సుబ్బారావు, దాసరి హనుమంతరావు గౌడ్, కోమటి ప్రసాద్, బెల్లంకొండ దశరథ, నార్ని శ్రీకాంత్, నార్ని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**బాపట్ల :** టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా వచ్చే ఎన్నికల్లో తానే పోటీ చేస్తున్నానని టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవరమ్మ అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఇంటింటికి టిడిపి, మీ మాటే - నా బాట, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 4వ వార్డు రైలుపేట పొట్టి శ్రీరాములు పార్క్ వద్ద నుండి నాయకులతో కలసి పర్యటించారు. మహిళలకు చీర, నిత్యావసర వస్తువులు తెచ్చుకునే సంచి, తమ గురించి తెలియజేసే కరపత్రాన్ని అందజేశారు. రాబోయే రోజుల్లో ప్రజలే ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పరిశా రమేష్ గౌడ్, ఫరీద్ మస్తాన్, తాతా చినబాబు, రాహుల్, సోమశేఖర్, బాలశంకర్, మానం శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, శివన్నారాయణ, శ్రీకాంత్, మారుతి ప్రసాద్, మొహనరావు, మెట్ల శ్రీనివాసరావు, ఉప్పాల కృష్ణ గౌడ్, షేక్ షాకా, గొర్ల గోపి, భావన్నారాయణ పాల్గొన్నారు.



చీరలు, కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నరేంద్రవర్మ

# 'ఏపీకి జగనే ఎందుకు కావాలి.?'




బోర్డు ఆవిష్కరించిన ఎంపిపి లలితకుమారి

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

మండలంలోని ఐలవరం సచివాలయం2 పరిధిలో ఏపీకి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి గోలి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎంపీపీ డివి లలిత కుమారి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సిఎం జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని అన్నారు. ఈ పథకాలు కొనసాగింపుకు జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గ్రామానికి అందిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఐలవరం1, 2 సచివాలయాలకు గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో రూ.45 కోట్ల నిధులు పథకాల రూపంలో అందజేసినట్లు కార్యదర్శి శ్రీనివాసరావు వివరించారు. జడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కరి, కోఆప్షన్ సభ్యులు షేక్ సలీం, సర్పంచి మాచర్ల కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ కర్ర జయశ్రీ, వైసిపి మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, మాచర్ల తులసి రంగారావు, బాలాజీ మల్లేశ్వరరావు, హేమ సుందరావు పాల్గొన్నారు.

**యద్దనపూడి :** అనంతవరం గ్రామంలో సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిదారులకు అందించిన నగదు వివరాల బోర్డులను గురువారం ఆవిష్కరించారు. ఎంపిడిఒ కృష్ణ కుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల వివరాలు ప్రజలు అందరికి తెపండని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మోహన్ రావు, ఉప సర్పంచ్ షేక్ శ్రీనివాస బాబు, ఇఒఆర్డి శ్రీనివాసరావు, పిఆర్ ఎఇ సురేష్, పంచాయతీ కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, స్వాతి, అలేఖ్య పాల్గొన్నారు.



బోర్డు ఆవిష్కరించిన ఎంపిడిఒ కృష్ణకుమారి

# రాష్ట్రస్థాయికి సైన్స్ ప్రాజెక్టుల ఎంపిక



రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికైన విద్యార్థులు

**ప్రజాశక్తి - బాపట్ల**

దేశంలో శాస్త్ర, విజ్ఞాన, సాంకేతిక రంగాల్లోని పరిశోధనలు సైన్స్ పట్ల విద్యార్థులు ఆసక్తి పెంపొందించుకోవాలని సైన్స్ జిల్లా అధికారి మహమ్మ ద్ సాదిక్ అన్నారు. బాపట్ల జిల్లా జాంద్రపేట బీవీ అండ్ బీఎన్ ప్రభుత్వ పాఠశాలలో ఏపీ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అప్కాస్ట్) ఆధ్వర్యంలో నిర్వహించిన 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయిలో 25 మండలాల నుండి 93ప్రాజెక్టులు పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. అయితే 7 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల మరింత ఆసక్తిని పెంపొందించడమే సైన్స్ కాంగ్రెస్ ఉద్దేశ్యమని అన్నారు. గుళ్లాపల్లి జెడ్‌పి పఠశాల విద్యార్థిని బి కశ్యశ్రీ ప్రదర్శించిన మీనామృతం, వడ్డేవారిపాలెం స్కూల్ విద్యార్థిని వి శ్రావ్య ప్రదర్శించిన హనీ బీ ట్రాన్స్ ఫార్మింగ్, మక్కెనవారిపాలెం పాఠశాల విద్యార్థిని జి రాగనాగ అనిషిత ప్రదర్శించిన గ్రీన్ వాష్, గంగవరం ఎస్‌వికె హైస్కూల్ విద్యార్థిని పి అంకిత ప్రదర్శించిన బుల్లెట్ మిల్లెట్స్, చినమట్లపూడి విద్యార్థిని కె భవ్యశ్రీ ప్రదర్శించిన పశుసంవర్ధని దాణామృతం, సజ్జాపురం విద్యార్థిని వి బాల అమూల్య ప్రదర్శించిన ట్రెడిషనల్ రెమెడీస్ ఫర్ ఎనీమియా, జాంద్రపేట బివి అండ్ బిఎన్ స్కూల్ విద్యార్థిని ప్రదర్శించిన ఫ్లోటింగ్ లాడిల్స్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. లేళ్ల లీలా కృష్ణ, వలివేటి వెన్నెల, కిరణ్ నందమూడి, మీర్జాన్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించినట్లు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, మొమెంటోలను డిఇఒ పివిజె రామారావు అందజేశారు.



బస్టాండులో దాతల సహకారంతో నిర్మించిన మరుగుదొడ్లు

# దాతలకు అభినందనలు

**ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్**

స్థానిక బస్టాండ్ ఆవరణలో దాతల సహకారంతో మూత్రశాలల షీట్లు ఏర్పాటుకు సహకరించిన దాతలకు ఆర్టీసీ అధికారులు ఈడి ఆదం సాహెబ్, ఈఈ వెంకటేశ్వర్లు, చీరాల డిఎం శ్యామల, ఏఈ సుబ్బారావు అభినందనలు తెలిపారు. మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షులు ఏ మోహనకృష్ణ ఆధ్వర్యంలో పనులు చేయడం పట్ల అభినందనలు తెలిపారు. రూ.35వేల అంచనాలతో పనులు చేశారు. నిత్యం వందల మంది ప్రయాణికులు వివిధ గ్రామాలకు వెళుతూ ఉంటారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న సాగరమిత్రనాగరాజు

# అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి - రేపల్లె**

వేట సమయంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని రాజుకాల్వ సాగరమిత్ర బి నాగరాజు అన్నారు. మండలంలోని రాజుకాల్వ సచివాలయం పరిధిలో మత్స్య సాగుబడి గురువారం నిర్వహించారు. ఎప్పటికప్పుడు వాతావరణ సూచికలను పాటిస్తూ వేటను కొనసాగించాలని చెప్పారు. బలపడిన వాయుగుండం కారణంగా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడినట్లు ఐఎండి వెల్లడించిందని తెలిపారు. విశాఖ, పరదీప్ (ఒడిశా)కు 380కెఎం దూరంలో కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం గంటకు 18కెఎం వేగంతో వాయవ్య దిశగా కదులుతోందని తెలిపారు. ఎల్లుండి ఉదయం బంగ్లాదేశ్ వద్ద తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. దీని ప్రభావంతో కోస్తాంధ్ర, ఒడిశాలో భారీ వర్షాలు పడతాయని తెలిపారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. పోస్ట్ బోట్లు రిజిస్ట్రేషన్, చేపలు పట్టడం లైసెన్స్‌లకు సంబంధించిన అధికారిని అడిగి సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో లంకెవానిదిబ్బ సాగర్ మిత్ర కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేసిన బ్రదర్ కిరణ్

# విద్యార్థులకు బహుమతులు

**ప్రజాశక్తి - రేపల్లె**

బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంసీఏ హాల్ నందు బాల బాలికల సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు ప్రిన్సిపల్ బ్రదర్ కిరణ్ బహుమతులు అందజేశారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో కూడా రాణించాలని అన్నారు. ఇటీవల జరిగిన అంతర్ జిల్లా తైక్వాండ్ పోటీలలో కె లక్ష్మీతులసి అండర్-17 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎన్నికైనట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ బ్రదర్ కిరణ్ కుమార్ విద్యార్థులను, అందుకు సహకరించిన ఉపాధ్యాయులను అభినందించారు.

# డీవీఈవోగా ఎర్రయ్య బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



జిల్లా అధికారిని సత్కరిస్తున్న అధ్యాపకులు

జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా (డీవీఈవో)గా పి.ఎర్రయ్య గురువారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనను అభినందించడానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, ఇతర సిబ్బంది కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పరిచయ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ గతంలో రాష్ట్రస్థాయిలో అనేక బాధ్యతలు నిర్వహించాలని, నేటి నుండి బాపట్ల జిల్లాలో బాధ్యతలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యావ్యవస్థలో అధ్యాపక సిబ్బంది అందరూ కూడా సమానమేనని, ప్రభుత్వ మరియు ఎయిటెడ్ అని తేడా లేకుండా విద్యార్థిని, విద్యార్థుల భావి భవిష్యత్తు కోసం మనమంతా బాటలు వేయాలని పిలుపునిచ్చారు. మనందరి సమిష్టి కషి ఫలితంగా రానున్న రోజులలో రాష్ట్రస్థాయిలో బాపట్ల జిల్లాను ఇంటర్ విద్యారంగంలో మొదటి స్థానంలో నిలపటానికి మనమంతా కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. తదుపరి ఆంధ్ర ప్రదేశ్ జూనియర్ కళాశాలల రాష్ట్ర అధ్యక్షుడు గారపాటి పుష్పరాజు మాట్లాడుతూ సమర్థవంతమైన అధికారి ఎర్రయ్య అని, ఆయన గురించి గతంలో రాష్ట్రస్థాయిలో అనేక సందర్భాలలో విన్నామని తెలిపారు. ఏ సమయంలోనైనా, ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఒడిదుడుకులు లేకుండా మనమంతా కలిసి పనిచేయడానికి మేము సిద్ధం అని తెలిపారు. తదుపరి జూనియర్ కళాశాలల స్టేట్ జనరల్ సెక్రెటరీ చావా రామారావు మాట్లాడుతూ ఎర్రయ్య ఏ బాధ్యత అప్పగించిన సమర్థవంతంగా నిర్వహించగలిగిన అధికారిగా గుర్తింపు ఉందని, తామంతా కూడా నియమ నిబంధనలకు లోబడి పని చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏకే అండ్ పీకే కళాశాల ప్రిన్సిపల్ శవనం శైలజవాణి, నూతలపాడు బిఎస్ వికెఆర్ఎం. ప్రిన్సిపల్ వి. శ్రీవాణి, వేటపాలెం బి.ఎస్.ఎస్.బి. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ తిలక్, పర్చూరు ప్రిన్సిపల్ చింపరెడ్డి, ఇంకొల్లు డిఎన్ఎమ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యు. రవికుమార్ పాల్గొన్నారు.

## టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా 'దేవిశెట్టి'

ప్రజాశక్తి-ఒంగోలు



ఎన్నికైన నూతన కార్యవర్గం..

టెక్నికల్ ఆఫీసర్ అసోసియేషన్ జిల్లా బాడీని గురువారం ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఆఫీసర్స్ టెక్నికల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. సూర్యనారాయణరాజు, కష్ణారెడ్డి, షరీఫ్, కిషోర్, సునీల్ పాల్గొని పరిశీలకులుగా ఉన్నారు. ప్రకాశం జిల్లా టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎస్సీ కన్స్ట్రక్షన్ సర్కిల్ ఒంగోలుకు చెందిన దేవిశెట్టి శ్రీనివాసులు, సెక్రటరీగా ఇరిగేషన్ సర్కిల్‌కు చెందిన కె శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా ఎస్సీ కన్స్ట్రక్షన్ సర్కిల్ నుండి సిహెచ్.రమణ, మిగతావారు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనట్లు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులకు రాష్ట్ర టెక్నికల్ ఆఫీసర్ అసోసియేషన్ నుండి అభినందనలు తెలియజేశారు.

# 'దిశ' ఉంటే పోలీస్ రక్షణ ఉన్నట్లే..

- జిల్లావ్యాప్తంగా దిశ యాప్ మెగా డ్రైవ్ - ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



ప్రయాణికుల సెల్‌ఫోన్లలో దిశా యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న పోలీసులు

దిశ యాప్ మీ చెంత ఉంటే మీకు రక్షణగా మీతో పోలీస్ ఉన్నట్లేనని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. రాష్ట్ర డిజిపి కె.వి రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు బాపట్ల జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు వార్డు, సచివాలయం మహిళ పోలీసులు వారి పరిధిలోని గ్రామాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్, ముఖ్యమైన కూడళ్ళు, కాలేజీలు, స్కూల్ లు మరియు ఫ్యాక్టరీ లలో దిశ యాప్ మెగా డ్రైవ్ నిర్వహించి ప్రజలకు దిశ యాప్‌పై విస్తత అవగాహన కల్పించారు. వారితో దిశ యాప్ డౌన్లోడ్ చేయించి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన దిశ యాప్‌ను మొబైల్ ఫోన్ లో నిక్షిప్తం చేసుకున్నప్పుడే దిశ యాప్‌కు సార్థకత చేకూరుతుందన్నారు. దిశ యాప్‌పై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించి వారి మొబైల్ ఫోన్ లో దిశ యాప్ డౌన్లోడ్ చేసుకొని రిజిస్టర్ చేసుకొనేందుకు జిల్లా వ్యాప్తంగా దిశ యాప్ డౌన్లోడ్ మెగా డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. దిశ ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేసిన వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ కు సమాచారం వెళుతుందన్నారు. ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చెయ్యలేని స్థితిలో ఉంటే, ఫోన్ గట్టిగా షేక్ చేసినా పోలీసులకు సందేశం చేరుతుందని తద్వారా పోలీస్‌లు వెనువెంటనే ఆ ప్రదేశానికి చేరుకుని సహాయం అందిస్తారన్నారు. దిశ యాప్‌లో 100, 112 వంటి అత్యవసర నెంబర్లతో పాటు మీరు వున్న ప్రదేశానికి దగ్గరలో వున్న పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులు, మెటర్నిటీ సెంటర్లు, బ్లడ్ బ్యాంకులు, ట్రామా కేర్ సెంటర్లు, మెడికల్ షాపుల వివరాలు పొందుపరిచి వున్నాయని తెలిపారు. గురువారం నిర్వహించిన దిశ యాప్ మెగా డ్రైవ్‌లో సుమారు 16,000 మొబైల్‌లలో దిశ యాప్ రిజిస్ట్రేషన్ చేయించడం జరిగిందన్నారు. దిశ యాప్ మీ మొబైల్ ఫోన్లో ఉంటే చుట్టూ 10 మంది పోలీసుల రక్షణ ఉన్నట్లేనన్నారు.

వెనుకాముందు ఆలోచించుకోకుండా..

# ఎవరికీ సాయం చేయను..

- స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీని రద్దు చేసుకుంటున్నాం..
- పెత్తందారీ వ్యవస్థలో దళితుల మీద ఆరోపణలు అధికమయ్యాయి
- ఒంగోలు మేయర్ సుజాత



మాట్లాడుతున్న సుజాత

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మండువవారిపాలెం సర్వేనెంబర్ 494లో ఉన్న 14 ఎకరాలలో మంచళ్ల వెంకట శ్రీనివాసరావు అనే వ్యక్తి తన భర్త అరుళ్‌రాజ్ పేరు మీద ఏడాది కిందట ఇచ్చిన ఏడు ఎకరాల స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీని రద్దు చేసుకుంటున్నట్లు ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత తెలిపారు. ఇకపై వెనుకాముందు ఆలోచించుకోకుండా ఇక ఎవరికీ సాయం చేయబోమన్నారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పేద బ్రాహ్మణుడైన శ్రీనివాసరావు తనకు న్యాయం చేయాలని, తన పేరు మీద ఉంటే అందరూ భయపిస్తున్నారు కాబట్టి, మీ పేరు మీద పెట్టుకొని న్యాయం చేయాలని తమను కోరాడన్నారు. ఈ నేపథ్యంలో వెనకాముందు ఆలోచించకుండా తాను తప్పటడుగు వేసి పవర్‌ఆఫ్ అటార్నీ తన భర్త పేరు మీద తీసుకోవడం జరిగిందని వివరించారు. ఈ పవర్ ఆఫ్ అటార్నీ అంటే కేవలం భూమికి రక్షణగా, ఒక మెసెంజర్‌లాగా నిలబడటమే కానీ ఎలాంటి హక్కు పొందడం కాదని తమ లాయర్ చెప్పిన మీదటే తాము పవర్ ఆఫ్ అటార్నీ తీసుకోవడానికి నాడు ఒప్పుకోవడం జరిగిందని వివరించారు. ఈ భూమి తాము ఎవరికీ విక్రయించలేదని, రూపాయి కూడా ఆదాయం పొందలేదని స్పష్టం చేశారు. ఇది చూసిన కొంతమంది పెత్తందార్లు దళిత మహిళగా ఉన్న తనను అభాసుపాలు చేసే కుట్ర చేస్తున్నారని, అందుకే అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు రాజకీయంగా ఎదగడం ఇష్టం లేని వారు ఇలాంటి పనులు చేస్తారని ఆరోపించారు. మాజీ ఐఎఎస్ అధికారి విజయకుమార్ జిల్లాలో కలెక్టర్‌గా పనిచేస్తున్నప్పుడు కూడా ఇలాంటి వివక్ష ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. దళితులు ఏమి చేసిన తప్పుగా కనిపిస్తోందన్నారు. అందుకే తాను మానసికంగా క్షోభకు గురై తన భర్త మీద తీసుకున్న పవర్ ఆఫ్ అటార్నీని రద్దు చేసుకోవాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. ఇక మీదట ఇలాంటి తప్పు చేయబోనని తేల్చిచెప్పారు. సాయం కోసం వచ్చేవారు అధికారుల వద్దకే పోవాలని, తనకు సాయం చేసేందుకు ఎలాంటి హక్కూ లేదన్నారు. ఇకమీదట ఎలాంటి పొరపాట్లూ చేయబోనని చెప్పారు. 494 సర్వే నెంబర్‌లో భూమి విషయంలో నిజమైన వారసుడుగా ఉన్న మంచళ్ల వెంకట శ్రీనివాస్‌కు న్యాయం చేయాలని తాను స్వయంగా కలెక్టర్, ఆర్డీఓ, ఎంఆర్‌ఓలను కోరడం జరిగిందని, పవర్ ఆఫ్ అటార్నీ తీసుకోవడం వెనుక తనకు ఎలాంటి స్వలాభం జరగలేదని మేయర్ ఉద్ఘాటించారు. తన మీద వచ్చిన ఆరోపణలు తనను ఎంతగానో భాదించాయని చెప్పారు. పెత్తందారీ వ్యవస్థలో దళితులమీద ఆరోపణలు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

494 సర్వే నెంబర్‌లో 14 ఎకరాల భూమి తన తాతల వారసత్వ సంపద అని, దాన్ని కొంతమంది కబ్జా చేసిన నేపథ్యంలో చాలా సంవత్సరాల నుంచి తనకు న్యాయం చేయాలని తాను అధికారులు చుట్టూ తిరుగుతున్నానని మంచళ్ల వెంకట శ్రీనివాసరావు అనే వ్యక్తి పాత్రికేయుల సమావేశంలో మేయర్ సమక్షంలో వెల్లడించారు. ఆ భూమిని కొంతమంది కబ్జా చేసి తనను భయపెడుతున్నారని, అందుకే న్యాయం చేయాలని తాను మేయర్‌ను సంప్రదించనన్నారు. వారి పేరు మీద భూమి పవర్ ఆఫ్ అటార్నీ ఉంటే తనకు న్యాయం చేకూరుతుందనే తాను ఇష్టపూర్వకంగా ఏడు ఎకరాలను మేయర్ భర్త పేరు మీద స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో ఎవరి బలవంతం లేదన్నారు. ఈ విషయంలో మేయర్ కుటుంబంమీద ఆరోపణలు చేయడాన్ని ఆయన ఖండించారు. వారు తన భూమిని ఎవరికీ విక్రయించలేదని, రూపాయి కూడా తన నుంచి ప్రతిఫలం ఆశించలేదని చెప్పారు. విలేకర్ల సమావేశంలో మేయర్ భర్త అరుళ్‌రాజ్ కూడా పాల్గొన్నారు.

అణగారిన వర్గాల

# అభ్యున్నతి కోసమే కులగణన

మంత్రి నాగార్జున



మాట్లాడుతున్న మేరుగు నాగార్జున

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పేద ప్రజలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసమే కుల గణన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. ఏపీ రాష్ట్ర కుల గణన-2023పై జిల్లాస్థాయి సదస్సు గురువారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. అన్ని కుల సంఘాల నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంచార జాతులతో పాటు కులాల మధ్య అంతరాలను తొలగించడానికే కులగణన నిర్వహించనున్నట్లు రాష్ట్ర మంత్రి తెలిపారు. 91 సంవత్సరాల తర్వాత ఏపీలో సామాజిక పరిస్థితులను గుర్తించే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అసమానతలు, భిన్నాభిప్రాయాలు ప్రజలలో తొలగుతాయన్నారు. స్పష్టమైన వివరాలు ఉంటేనే అణగారిన వర్గాల కొరకు సంక్షేమ పథకాలు అమలు, నిధుల కేటాయింపులకు ప్రణాళిక రూపొందించే అవకాశం ఉంటుందన్నారు. కుల గణన కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు భాగస్వాములు కావాలని, అన్ని విధాలుగా సహకరించాలని ఆయన కోరారు. సామాజిక వర్గాల వారీగా ప్రజల సంఖ్య స్పష్టంగా తెలిసే అవకాశం ఉందన్నారు. తద్వారా ఆయా వర్గాలలో సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి వీలుంటుందన్నారు. కలెక్టర్ పి రంజిత్‌బాషా మాట్లాడుతూ సమీకత సమగ్రాభివద్ధి కోసం కులగణన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. ఈ నెల 27 నుంచి ఏపీ రాష్ట్ర కులగణన కార్యక్రమం వారం రోజులపాటు కొనసాగుతుందన్నారు. మిగిలిపోయిన కుటుంబాలను డిసెంబర్ 10వ తేదీలోగా చేర్చనున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు ఇంటింటికీ తిరిగి కులగణన సర్వేలో పాల్గొంటారన్నారు. సర్వేలో ప్రజల నుంచి సేకరించే కుటుంబ వివరాలు అత్యంత గోప్యంగా ఉండేలా సాఫ్ట్ వేర్ పనిచేస్తుందని వివరించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ మాట్లాడుతూ సామాజిక ఆర్థిక అభివద్ధి కోసం సమగ్ర కుల గణన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 13వ తేదీన రాష్ట్ర క్యాబినెట్లో మంత్రి వర్గం ఆమోదించిన విషయాలను ఆయన వివరించారు. ఈ నెల 17న మండల, మున్సిపల్ స్థాయిల్లో అధికారులకు ప్రత్యేక శిక్షణలు ఉంటాయన్నారు. ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లకు శిక్షణ జరుగుతుందన్నారు. ఈనెల 16 నుంచి 25వ తేదీ వరకు ప్రజల వద్దకు వెళ్లి వాలంటీర్లు జన గణనపై సమాచారం చేరవెయ్యాలన్నారు. కుటుంబంలోని వ్యక్తుల వివరాలు, విద్యార్హతలు, తాగునీటి సదుపాయం, కులం, ఉప కులం, వ్యవసాయ భూమి, నివాస స్థలం, పశువుల వివరాలు మాత్రమే సర్వే ద్వారా సేకరిస్తారని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ కులసంఘాల నాయకులు మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగేలా పారదర్శకంగా కుల గణన నిర్వహించాలని కోరారు. సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. నకిలీ ధ్రువీకరణ పత్రాల జారీని అరికట్టాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్యే కోన రఘుపతి, డిఆర్ఓ వెంకటరమణ, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు జి రవీందర్, పి. సరోజిని, బి.సి.హేలా షారాన్, ఎస్సీ, బిసి సంక్షేమశాఖల అధికారులు జె.రాజాదిబోరా, బి.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.